క్లుప్తంగా

మానవ హక్కులపై అవగాహన అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న అనసూయాదేవి

మల్కాపురం: మానవ హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఎన్ఎస్ఎస్ అధికారులు ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి,వై.అనసూయాదేవి అన్నారు. మానవహక్కుల దినోత్సవం సందర్భంగా మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో శనివారం నిర్వహించిన సదస్సులో వారు మాట్లాడారు. వ్యక్తిత్వ వికాసానికి, సమాజ ప్రగతికి, ప్రజాస్వామ్యం విజయవంతం అవ్వడానికి,మూఢ నమ్మకాల నిర్మూలనకు మానవహక్కులు ఎంతో అవసరం అన్నారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

భారీగా కార్తీక అన్నసమారాధన



భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న ఎమ్మెల్యే గణబాబు, శివాజీ

గోపాలపట్నం: గోపాలపట్నం శ్రీపార్వతీ చంద్రమౌళీశ్వరాలయంలో కార్తీక మాస అన్న సమారాధన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబు అన్న ప్రసాదాలు వితరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో కేంద్ర గౌరీసేవా సంఘం అధ్యక్షుడు బుద్ధ శివాజీ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన



ఈవీఎంల పని తీరును వివరిస్తున్న ఆర్ఐ సురేష్ కుమార్

గోపాలపట్నం: ఈవీఎంలు ఏవిధంగా పనిచేస్తాయి... ఓటు ఎలా వేయాలన్న అంశాలపై గోపాలపట్నం రెవెన్యూ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం గోపాలపట్నం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేష్ జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురం ఎంపీపీస్కూల్‌లోని బూత్ నంబర్ 26లో ఓటింగ్ వేయడంపై అవగాహన కల్పించారు. ప్రతీ ఓటరు ఎల్రక్టానిక్ ఓటింగ్ మిషన్, కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీప్యాడ్‌ల గురించి తెలుసుకోవాలన్నారు. ఈ పరికరాలు ఏవిధంగా పని చేస్తున్నాయో వివరించారు. ప్రజలకు కలిగే అనుమానాలు నివృత్తి చేశారు. ఎవరైనా బలవంతంగా ఓట్లు వేయాలని ప్రయత్నిస్తే మిషన్ పని చేయకుండా ఆగిపోయేలా ఒక బటన్ ఉంటుందని దీన్ని అత్యవసరంగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి నిందితులకు రిమాండ్

ఆరిలోవ: గుట్టుగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను ఆరిలోవ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వారు తెలిపిన వివరాలిలా.. కర్ణాటక రాష్ట్రం గుల్గికి చెందిన బసవర్ మురళీకృష్ణ, తెలంగాణ రాష్ట్రం సూర్యాపేటకు చెందిన బండి రాహుల్ హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లో బర్గర్ కేఫ్‌లో పనిచేసేవారు. ఇటీవల వారిరువురు పనిమానేశారు. అక్కడ నుంచి నాలుగు రోజుల కిందట అరకు చేరుకున్నారు. అక్కడ ఓ వ్యక్తితో పరిచయం పెంచుకొని అతని వద్ద 5 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. దానిని తీసుకొని విశాఖ చేరుకున్న ఆ యువకులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఆరిలోవ పోలీసులు కలిసి హనుమంతవాక వద్ద శనివారం పట్టుకున్నారు. వారి నుంచి 5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరిచారు. వారికి కోర్టు రిమాండ్ విధించినట్లు ఆరిలోవ సీఐ సోమశేఖర్ తెలిపారు.





ప్రతి ఆదివారం భక్తుల రద్దీ ఇలా..



పుట్టబంగారం వద్ద కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు

ఎర్నిమాంబ క్షేత్రానికి ప్రగతి కాంతులు



ఇది కదా అభివృద్ధి

దశాబ్దాల కిందట వెలసిన ఎర్నిమాంబ అమ్మవారు భక్తుల కొంగుబంగారంగా విలసిల్లుతున్నారు. తొలుత రోడ్డు పక్క చిన్నగా మొదలైన అమ్మవారి ఆలయం తర్వాతి రోజుల్లో క్షేత్రంగా విరాజిల్లింది. ఇటీవల దాత, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ రూ. 33 లక్షల సొంత నిధులు వెచ్చించడంతో ఆలయం ఆకర్షణీయంగా మారింది.

- ఎర్నిమాంబ ఆలయం ఆధునికీకరణ
- కొత్తగా గోపురం, మండపాల నిర్మాణం. గ్రిల్స్, వాల్‌టైల్స్ ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న భక్తులు

కంచరపాలెం : కాన్వెంట్ కూడలి బీఆర్‌టీఎస్ రహదారిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారు జ్ఞానాపురం, అల్లిపురం, అచ్చియ్యమ్మపేట ప్రజల ఇలవేల్పుగా కొలువై ఉన్నారు. దశాబ్దాల చరిత గల ఈ ఆలయ అభివృద్ధిలో భాగంగా కొత్త కట్టడాలు, నిర్మాణాలు పూర్తి చేశారు. ఆలయానికి చెందిన ఆర్చి, భక్తుల కోసం ప్రత్యేక దర్శనాల క్యూలైన్లు నిర్మించారు. తలనీలాలు సమర్పించేందుకు షెడ్ నిర్మాణం, కొబ్బరికాయలు కొట్టేందుకు ప్రత్యేక కౌంటర్ నిర్మాణం జరిగింది. ఆలయ పునర్నిర్మాణం తర్వాత భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. ఏటా మే నెల మూడో శనివారం తొలేళ్ల సంబరం, ఆదివారం వైభవంగా జాతర నిర్వహిస్తారు. ఏనభై ఏళ్ల క్రితం విశాఖ కుగ్రామంగా ఉన్నప్పుడు అప్పటి భక్తులు అమ్మవారికి చిన్నగుడి నిర్మించారు. ఈ ప్రాంతంలో తుప్పలు, డొంకల మధ్య అమ్మవారు వెలసినట్టు భక్తులు చెబుతారు. పదుల సంఖ్యలోనే ఇళ్లుండడంతో చీకటి పడితే జనసంచారం ఉండేది కాదు. రాత్రి సమయంలో ఈ మార్గంలో వెళ్లేందుకు ప్రజలు భయపడేవారు. గత నలభై ఏళ్లుగా జనావాసాలు పెరగడంతో రోడ్లు విస్తరింపబడ్డాయి. ఆలయం పక్కగా జీవీఎంసీ అధికారులు రోడ్లు విస్తరించారు. ఈ విధంగా రోడ్లు విస్తరించడంతో అమ్మవారి భక్తులు పెరిగారు.

పక్క జిల్లాల నుంచి కూడా భక్తులు..

విశాఖతో పాటు శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి, తూర్పుగోదావరి తదితర జిల్లాల నుంచి కూడా భక్తులు అమ్మవారి దర్శనార్థం వస్తుంటారు. 2007లో భక్తులే దేవాలయాన్ని ఎండోమెంటుకు అప్పగించారు. అప్పటి నుంచి అమ్మవారికి సేవలందించాలనే ధ్యేయంతో జ్ఞానాపురం ప్రాంతానికి చెందిన స్థానికులు సేవలందిస్తున్నారు.



నాడు ఎర్నిమాంబ అమ్మవారు



నేడు ఎర్నిమాంబ అమ్మవారు



నూతనంగా నిర్మించిన ఎర్నిమాంబ ఆలయం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి అమ్మవారి ఆలయాభివృద్ధి వేగం పుంజుకుంది. ఆలయ గోపురం, మండప నిర్మాణం, పుట్టబంగారం షెడ్, తలనీలాల షెడ్, గర్భగుడికి హంగులు, మండపాలకు ఎస్ఎస్ గ్రిల్స్, ఫ్లోర్, వాల్ టైల్స్, క్యూ లైన్ల గేట్లు ఏర్పాటు చేశారు. ఆలయానికి అందంగా రంగులు వేసి చూడముచ్చటగా తీర్చిదిద్దారు.

ఆడారి ఆనంద్ నిధులతో మరింత శోభ..

ఎర్నిమాంబ అమ్మవారి ఆలయాన్ని విశాఖ డెయిరీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ రూ. 33 లక్షల నిధులతో అందంగా రూపొందించారు. 2022లో ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభించి 2023 జూన్‌లో పూర్తి చేశారు. ఆడారి ఆనంద్‌కుమార్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గణపతి పూజ, దీక్షాధారణ, వాస్తు యోగిని క్షేత్రపాలక నవగ్రహ సర్వతోభద్ర మండప పూజలు నిర్వహించి శిఖర ప్రతిష్టా మహోత్సవ వేడుకలు జరిపారు. నాటి కార్యక్రమం ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ప్రత్యేక పూజల నేపథ్యంలో జరిగింది. వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్, ఆలయ ఈవో డి.సురేష్‌బాబా తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబ ఆలయాభివృద్ధికి దాత ఆడారి ఆనంద్‌కుమార్ ఇచ్చిన రూ. 33 లక్షలతో చేపట్టిన పనుల వివరాలు

నిర్మాణ పనులు	ఖర్చు
గోపుర నిర్మాణం	రూ.10.5 లక్షలు
మండప నిర్మాణం	రూ.6.2 లక్షలు
పుట్టబంగారం మండపం	రూ.2.4 లక్షలు
గర్భ గుడి తలుపులు	రూ.1.5 లక్షలు
మండపానికి ఎస్ఎస్ గ్రిల్స్	రూ.2.5 లక్షలు
ఫ్లోర్, వాల్ టైల్స్	రూ.3.5 లక్షలు
క్యూలైన్ గేట్లు	రూ.1.8 లక్షలు
ఆలయానికి రంగులు	రూ. 3.2 లక్షలు
తలనీలాల షెడ్, విశ్రాంతి గది	రూ.1.4 లక్షలు



పూజలు చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్, దేవదాయశాఖ అధికారులు(ఫైల్)

అభివృద్ధి తర్వాత ఆలయం బాగుంది



ఎర్నిమాంబ అమ్మవారు మా ఇంటి ఇలవేల్పు. అమ్మవారి ఆలయం ఇటీవల కొత్తకళ సంతరించుకుంది. వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సొంత నిధులు వెచ్చించి అమ్మవారి ఆలయాన్ని తీర్చిదిద్దడం సంతోషకరం. ఇప్పుడు ఆలయంలో సదుపాయాలు భక్తులకు అనుగుణంగా ఉన్నాయి.

– పల్లా ఎర్నికుమార్, భక్తుడు, కంచరపాలెం

మరింత కృషి

ఎర్నిమాంబ అమ్మవారి భక్తులకు పలు సదుపాయాలు కల్పించాం. నిధుల లభ్యతను బట్టి మరింతగా ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం. భక్తులు వంటా వార్పు చేసుకునేందుకు, భక్తుల క్యూలైన్ ఏర్పాటుకు టెండర్లు పిలిచాం .త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

– డి.సురేష్‌బాబా, ఎర్నిమాంబ ఆలయ ఈవో, జ్ఞానాపురం

సౌకర్యాలు పెరిగాయి



మా తాతల కాలం నుంచి మా కుటుంబంలో అందరి పేర్లు ఎర్నిమాంబ అమ్మవారి పేరు కలిసొచ్చేలాగే పెడుతున్నారు. దయ గల తల్లి ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం గతంలో కంటే అభివృద్ధి చేసిన తర్వాత మరింత బాగుంది. భక్తుల సౌకర్యాలు పెరిగాయి. సొంత నిధులతో ఆలయాన్ని అభివృద్ధి చేసిన ఆనంద్‌కుమార్‌కు ధన్యవాదాలు

– వాసుపల్లి విజయ, భక్తురాలు, అచ్చియ్యమ్మపేట

పేదల అభ్యున్నతికి సీఎం జగన్ పెద్దపీట

- భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- చంద్రనగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

గోపాలపట్నం: పేదల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పెద్దపీట వేశారని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శనివారం సాయంత్రం 89వ వార్డు చంద్రనగర్‌లోని 463 సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ కులం, మతం పార్టీ ప్రాంతాలు అని చూడకుండా ప్రభుత్వ పథకాలు అందించారన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజల చెంతకే పాలన తెచ్చారని తెలిపారు. సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాలకు రూ.4.69 కోట్లు అందించారని వివరించారు. భీమిలి నియోజకవర్గం ప్రాంతంలో రూ.17.15కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అంతేకాకుండా నూతనంగా కమ్యూనిటీహాళ్లు, రోడ్లు డ్రైనేజీలు, నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు మరో రూ.15 కోట్లు వెచ్చించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి నట్టు చెప్పారు. మళ్లీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో వార్డు క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి గోపాలకృష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ, నాయకులు ఆళ్ల పైడిరాజు, షేక్ రహమాన్, పొలమరశెట్టి విజయ్, ఏపీడీ శ్రీరామ్ ఏతలు వెంకటలక్ష్మి, వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

మర్యాద పూర్వక కలయిక



సంజీవరెడ్డిని కలిసిన షిప్‌యార్డ్ ఐఎన్‌టీయూసీ నాయకులు

సింధియా: ఆల్ ఇండియా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు, షిప్‌యార్డ్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డిని శనివారం షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ జనరల్ సెక్రటరీ పి.ఎస్.ఆర్.మూర్తి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని స్వగృహంలో సంజీవ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన యూనియన్ సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ, సంస్థ అభివృద్ధికి, ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతి

హిందూస్థాన్ షిప్‌యార్డ్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) నాయకులు శనివారం హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి, జి.కిషన్‌రెడ్డిని యూనియన్ జనరల్ సెక్రటరీ పి.ఎస్.ఆర్.మూర్తి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎల్ అండ్ ఎం సిరీస్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు.

ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం ఆంధ్ర'

- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్
- ఆడుదాం ఆంధ్ర పోటీల నిర్వహణకు మైదానాల పరిశీలన
- జింక్, షిప్‌యార్డ్ క్రీడామైదానాల ఎంపిక



జింక్ మైదానం వద్ద నాయకులతో మాట్లాడుతున్న ఆడారి ఆనంద్‌కుమార్



బ్యాటింగ్ చేస్తున్న ఆనంద్‌కుమార్

మల్కాపురం: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను నియోజకవర్గంలో అట్టహాసంగా నిర్వహించనున్నట్టు ఏపీ సూక్ష్మ చిన్న మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ చెప్పారు. ఆడుదాం ఆంధ్ర పోటీల నిర్వహించడానికి అణువైన మైదానాలను ఎంపిక చేయడానికి శనివారం ఆనంద్‌కుమార్ నాయకులతో కలిసి పర్యటించారు. జింక్,కోరమాండల్,షిప్‌యార్డ్ కళాశాల మైదానాలను పరిశీలించారు.కొంత సేపు అక్కడ క్రికెటర్‌లో ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడారు. అనంతరం కోరమాండల్,షిప్‌యార్డ్ క్రీడామైదానాలను పరిశీలించారు. జింక్, షిప్‌యార్డు మైదానాలను క్రీడా పోటీల నిర్వహణకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 32,78,019 మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్స్ చేసుకున్నారని వివరించారు.యువతలో క్రీడా ప్రతిభను గుర్తించి,వారికి ఉజ్వల భవిత ఇచ్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమం చేపడుతున్నారని తెలిపారు. కార్య క్రమంలో ఏపీ ప్రభుత్వ సలహాదారు మిలినీయం శ్రీధర్‌రెడ్డి, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, క్లస్టర్ అధ్యక్షుడు అంగ రాంప్రసాద్, కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు,బల్లా లక్ష్మణరావు,నాయకులు రేవళ్ల సత్యనారాయణ,ఆడారి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

మన రాజ్యాంగం ప్రపంచానికి మార్గదర్శకం

సీతమ్మధార: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకు మార్గదర్శకమని విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. బుల్లయ్య కళాశాల రోడ్డులోని అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ 40 వసంతాల(రూబి జూబ్లీ) వేడుకల్లో భాగంగా శనివారం అంబేడ్కర్ భవన్‌లో సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టి మారుమూల గ్రామం నుంచి ప్రపంచ స్థాయి మేధావిగా ఎదిగిన అంబేడ్కర్ జీవితం నేటితరానికి స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళిత పక్షపాతి అని, ఎస్సీ, ఎస్టీలపై ఎంతో ఆదరణ చూపిస్తూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. అంబేడ్కర్ భవన్ అభివృద్ధికి ఎంపీ కోటా నుంచి రూ.25 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. అవసరమైన మేరకు నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా దళితుల స్థితిగతుల్లో మార్పు రాలేదన్నారు. రాజ్యాంగ హక్కులు పొందేందుకు అందరూ సమష్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. సొసైటీ ప్రధాన కార్యదర్శి జేవీ ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణ్‌రావు, కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.అశోక్‌కుమార్, డాక్టర్ అర్జున్, కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, మాజీ కార్పొరేటర్ కొప్పుల వెంకటరావు, మైనార్టీ సంఘం నాయకులు ఐఎం అహ్మద్, డాక్టర్ మాటూరి శ్రీనివాస్, ఆర్పీఐ రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి రాజీ మార్గం ఉత్తమం

గాజువాక : కోర్టు కేసులను పరిష్కరించుకోవడానికి రాజీమార్గం ఎంతో ఉత్తమమని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి షణ్ముఖరావు అన్నారు. గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్ శిబిరంలో ఆయన ప్రసంగించారు. రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకోవడం ద్వారా కక్షిదారులకు సమయం, ధనం వృథా కాకుండా ఉంటాయన్నారు. కక్షిదారుల మధ్య సంబంధాలు బలపడతాయన్నారు. గాజువాకలోని వివిధ కోర్టుల్లో గల 181 కేసులను ఈ శిబిరంలో రాజీమార్గం ద్వారా పరిష్కరించినట్లు కోర్టువర్గాలు తెలిపాయి. పరిష్కారమైన కేసుల విలువ రూ.3.79 కోట్లని పేర్కొన్నాయి. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఇ.రాజేంద్రబాబు, వి.పల్లవి, వై.శ్రీలక్ష్మి, వై.ప్రేమలత, గాజువాక బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతో విజయం



దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఉక్కు పరిరక్షణ కోసం కార్మికులు పట్టు వదలక చేస్తున్న పోరాటానికి కేంద్ర ప్రభుత్వం సమాధానమివ్వాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 1031వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన ఎస్ఎంఎస్-1 విభాగ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఐక్య పోరాటాలతో విజయం తథ్యమన్నారు. కార్మికులంతా ఐక్యంగా ఉంటూ ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.